క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, మండల కో ఆప్షన్ సభ్యులతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాచర్ల: మండలంలోని మెదంవారిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ లైను పనుల కారణంగా అనుమలవీడులోని 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాల గురవయ్య మంగళవారం తెలిపారు. ఆ ప్రాంతంలోని ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఈవో, అధికారులు

మార్కాపురం టౌన్: ఈనెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తరం ద్వారం దర్శనం కోసం భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో జీ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కమిషనర్ నారాయణరావు, అధికారులు ఆలయంలో భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారు శ్రీమహావిష్ణువుగా భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనమివ్వనున్నారు. ఇందుకోసం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కంభం: బీసీ కార్పొరేషన్ నుంచి రుణాలు పొందేందుకు సచివాలయాల్లో ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం సంబంధిత పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని ఆయన కోరారు.

కసిగా కరుస్తున్నాయ్!

భౌ బోయ్.. కుక్కల కూటమి



పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో కుక్క కాటు కేసుల సంఖ్య వింటే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. గడిచిన ఆరు నెలల్లో సుమారు 4 వేలకు పైగా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతానికి పీహెచ్‌సీల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ల నిల్వలు ఉన్నప్పటికీ కేసుల సంఖ్య మాత్రం విపరీతంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. వీధి కుక్కల సంతానోత్పత్తిని కట్టడి చేయకుండా అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. దీంతో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు తరచూ దాడి చేస్తున్నాయి.

- మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో గడిచిన ఆరు నెలల్లో 4 వేలకు పైగా కుక్క కాటు కేసులు
- పల్లెలు మొదలు పట్టణాల వరకు విపరీతమైన కుక్కల బెడద
- వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ కరిచేస్తున్న వైనం
- రోడ్లపై వెంబడిస్తుండటంతో వాహనదారుల్లో భయాందోళన
- వీధి కుక్కల సంతానోత్పత్తిని నియంత్రించకపోవడంతో సమస్య జఠిలం

సాక్షి నెట్‌వర్క్: గిద్దలూరు నియోజకవర్గంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధులు, రోడ్ల వెంట పదుల సంఖ్యలో తిరుగుతున్న శునకాలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళ వాహనదారులు, పాదచారులపై దాడులకు తెగబడుతున్నాయి. బేస్తవారిపేట, పాపాయిపల్లె, సోమవారిపేట గ్రామాల్లో రాత్రివేళ వీధుల్లోకి అడుగు పెట్టాలంటేనే జనం భయపడుతున్నారు. సోమవారం జేసీ అగ్రహారంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఏడుగురిని గాయపరచడం వీధి కుక్కల సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.



గిద్దలూరులో జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద కుక్కల గుంపు



గిద్దలూరు పోలీస్ స్టేషన్ రోడ్డులో కోతుల సమూహం



బేస్తవారిపేటలో రాత్రి వేళ గుంపుగా తిరుగుతున్న కుక్కలు

రోడ్లే ఆవాసం


మార్కాపురం పట్టణంలోని పీఎస్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, శివాజీ నగర్, కంభం రోడ్డు, నాగులవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. పొదిలి నగర పంచాయతీలోని పలు వీధుల్లో కుక్కల దెబ్బకు పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇస్లాంపేట, నవాబ్ మిట్ట, ప్రకాశ్‌నగర్, విశ్వనాథపురంలోని ఒకటి, రెండు, మూడు లైన్లలో కుక్కల బెడద అధికంగా ఉంది. కుక్క పిల్లలు పుట్టిన నాలుగు రోజులకే రోడ్డుపైకి చేరి వాహనాలకు అడ్డుతగులుతున్నాయి.



పొదిలిలో రోడ్డుపై మోహరించిన కుక్కలు

కుక్కలు, కోతులతో ఇక్కట్లు

గిద్దలూరు పట్టణంలో వీధి కుక్కలతోపాటు కోతుల బెడత తీవ్రంగా ఉంది. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, నరసింహస్వామి రోడ్డు, బ్రిటన్ రోడ్డు, పెద్ద మార్కెట్ సెంటర్, యాదవ బజారులోని ఎంపీయూపీ స్కూల్ ఏరియా, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వీధి, బీసీ బాలికల వసతి గృహం సమీపంలో కుక్కలు, కోతులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి తినుబండారాలు లాక్కెళ్లడమే కాకుండా దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలల వద్ద కుక్కలు, కోతులు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయపడుతున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో కోతుల గుంపు విద్యార్థులు తినే కంచాలను సైతం బలవంతంగా లాగుతుండటంతో తరగతి గదులల్లోకి పరుగులు తీస్తున్నారు. పార్కింగ్ చేసిన బైకుల్లో ఉన్న వస్తువులను కోతులు నాశనం చేస్తున్నాయి. కోతులను పట్టించి నల్లమల అడవిలో వదిలేయడంతోపాటు కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించేందుకు నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



6 నెలలు.. 4000 కేసులు

- మార్కాపురం జిల్లా వైద్యశాలలో దాదాపు 180, అర్బన్ పీహెచ్‌సీలో 60 కేసులు నమోదయ్యాయి. తిప్పాయపాలెం పీహెచ్‌సీ పరిధిలో 10 కేసులు వచ్చాయని డాక్టర్ రోహిత్‌నాయక్ తెలిపారు.
- గొట్లగట్టు పీహెచ్‌సీలో 101 కేసులు నమోదయ్యాయి. ఈ వారంలో 6 కేసులు నమోదయ్యాయని డాక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. కొనకనమిట్ల పీహెచ్‌సీ పరిధిలో 90 మంది కుక్క కాటు బారిన పడ్డారు.
- పొదిలి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీలో 105 కేసులు నమోదైనట్లు మెడికల్ ఆఫీసర్ సుగుణకుమార్ తెలిపారు. పొదిలి సామాజిక వైద్యశాలలో సగటున ప్రతి నెలా 100 మంది కుక్కకాటుకు గురవుతున్నారు. డిసెంబర్ నెలలో 106 కేసులు నమోదయ్యాయి.
- తర్లుపాడు మండలంలో సగటున నెలకు 30 చొప్పున 185 కేసులు నమోదైనట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరీష్ తెలిపారు.
- గిద్దలూరు మండలంలోని కేఎస్ పల్లి పీహెచ్‌సీ పరిధిలో 111, సంజీవరాయుడిపేట పీహెచ్‌సీ పరిధిలో 28, గిద్దలూరు పట్టణ ప్రభుత్వ వైద్యశాలలో 459 కేసులు వెరసి మొత్తం 598 మంది కుక్క కాటు బారినపడ్డారు.
- కంభం సీహెచ్‌సీ పరిధిలో 762, తురిమెళ్ల పీహెచ్‌సీ పరిధిలో 135 కుక్క కాటు కేసులు నమోమోదయ్యాయి.
- రాచర్ల మండలంలోని ఆకవీడు పీహెచ్‌సీ పరిధిలో 65, అనుములవీడు పీహెచ్‌సీలో 50 వెరసి మొత్తం 115 కేసులు నమోదయ్యాయి.
- కొమరోలు పీహెచ్‌సీలో 188, రాజుపాలెం పీహెచ్‌సీలో 209 మంది కుక్క కాటుకు వైద్యం చేయించుకున్నారు.
- అర్ధవీడు మండలంలోని యాచవరం పీహెచ్‌సీలో 40 కేసులు, అర్ధవీడు పీహెచ్‌సీలో 92 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.
- బేస్తవారిపేట పీహెచ్‌సీలో 90, గలిజేరుగుళ్ల పీహెచ్‌సీ పరిధిలో 123, మోక్షగుండంలో 102, పూసలపాడు పీహెచ్‌సీలో 44 మంది కుక్కకాటు బాధితులు చికిత్స పొందినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట్రావు

కంభం: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ మేడూరి వెంకట్రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో బాధ్యతగా పనిచేసిన సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారని, లోయ ప్రాంతాల్లో ఇంటర్నెట్ పనిచేయక పోవడంతో దాన్ని సాకుగా చూపుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండల విద్యాశాఖాధికారి సత్తార్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరవుతూ రోడ్లపై తిరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ప్రశ్నించారు. పాపినేనిపల్లి మెయిన్ స్కూల్లో పురాతన చెట్టుకొమ్మలు తెగి విద్యుత్ తీగల మీద పడితే స్తంభం విరిగిపోయిందని, దాన్ని మళ్లీ నిర్మించేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వద్ద విద్యుత్ సిబ్బంది రూ.6 వేలు తీసుకోవడం ఏంటని ఆ శాఖ అధికారి లోకేష్‌ను ఎంఈఓ నిలదీశారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, ఎంపీడీఓ నర్సయ్య, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ నిధులు ఏమయ్యాయి?



ఏపీఎంను ప్రశ్నిస్తున్న ప్రజానిధులు

బేస్తవారిపేట: లప్లీవుడ్ కార్యక్రమంలో భాగంగా వాటర్‌షెడ్ నిధులు రూ.38 లక్షలు ఉండాలని, ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయని వెలుగు ఏపీఎం ఆనందకుమారిని పలువురు ప్రజానిధులు ప్రశ్నించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వాటర్‌షెడ్ నిధుల వివరాలు తెలపాలని, ఆ నిధులకు సంబంధించి రుణాలు పొందిన వ్యక్తుల వివరాలు అందజేయాలని పలుమార్లు అడిగినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఇష్టారాజ్యంగా గ్రూప్‌లపై భారం నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభయహస్తం పథకంలో ఐదు–ఆరేళ్లు కంతులు కట్టారని, అభయహస్తం పింఛన్ ఇవ్వడం లేదు, కనీసం చెల్లించిన మొత్తం తిరిగి లబ్ధిదారులు చెల్లించలేదన్నారు. వీఓఏఎస్ విషయంలో హైకోర్టు ఆదేశాలు ఏం చేశారని, ఎందుకు అమలు చేయడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఎలా తొలగించారని, బ్యాంక్‌లో కొత్త అకౌంట్ ఓపెన్ చేయమని ఎలా ఆదేశాలు ఇచ్చారని పలువురు ఎంపీటీసీ, సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. పశువైద్యశాలల డాక్టర్‌లు అందరూ ఎందుకు సమావేశాలకు హాజరు కావడం లేదని, నోటీస్‌లు పంపినా పట్టించుకోక పోవడంపై సభలో ప్రశ్నించారు. కందిపప్పు గోడౌన్ నుంచి, డీలర్ల నుంచి అక్రమంగా తరలిపోతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పీహెచ్‌సీల్లో పరికరాలు, స్టేషనరీ కొనుగోలుకు మండల పరిషత్ నిధులు కేటాయిస్తారని, అవసరమైతే వివరాలు అందజేయాలని ఎంపీపీ కోరారు. జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీడీఓ ఏపీ రంగనాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో జరిమానా బోర్డుల ఏర్పాటు



ట్రాఫిక్ నిబంధనల బోర్డును ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఎస్సై అహరూన్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, హెల్మెట్ పెట్టుకోక పోయినా, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే అమలు పరిచే శిక్షలు, జరిమానాలు తెలిపే బోర్డులను ట్రాఫిక్ ఎస్సై అహరూన్ మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. కాలేజి రోడ్డు, పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, సెవెన్ హిల్స్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



తర్లుపాడు జెడ్పీ హైస్కూల్‌లో మెటీరియల్ అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



రాయవరంలోని కేజీబీవీలో విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం రూరల్/తర్లుపాడు: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కాపురం యూటీఎఫ్ నాయకుడు వి.రాజేష్, ఉపాధ్యాయులు పి.రమాదేవి, జీవీ సురేఖ, ఆర్ఎం యూన్సీపాల్, జయరామిరెడ్డి, కన్వీనర్ పిచ్చయ్య, కేజీబీవీ ప్రిన్సిపల్ విజయ, తర్లుపాడు యూటీఎఫ్ అధ్యక్షుడు కె.జగన్‌బాబు, కార్యదర్శి ఎస్‌కె నజీర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామంలో పేడదిబ్బలతో పాటు నిలిచిన మురికినీరు

పొదిలి రూరల్: ప్రజలు తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉప్పలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుగుణకుమార్ సూచించారు. పొదిలి మండలంలోని ఈగలపాడులో మూడో రోజు ఉచిత వైద్య శిబిరం మంగళవారం కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామంలో కీళ్ల నొప్పులు, జ్వరాలు తగ్గుముఖం పట్టినట్లు చెప్పారు. గ్రామంలో మురికి నీటి కాలువల వద్ద, రోడ్లపై నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, అబేట్ పిచికారితో పాటు ఫాగింగ్ చేయించినట్లు తెలిపారు.



ఈగలపాడులో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం

గంజాయి, లిక్కర్ రవాణా చేస్తే చర్యలు



కార్గోలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

మార్కాపురం: ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారా గంజాయి, నాన్ పెయిడ్ లిక్కర్ సరఫరా చేసినా, బుక్ చేసినా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం రాత్రి మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లోని ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్శిల్స్‌లో ఏమైనా అనుమానాస్పద వస్తువులు ఉన్నాయేమో పరిశీలించారు.

గొర్రెలు, మేకల సంతకు స్థల పరిశీలన



తలమళ్లలో సంతకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ సిబ్బంది

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని తలమళ్ల సమీపంలో పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలంలో గొర్రెలు, మేకల సంత నిర్వహణకు మంగళవారం స్థలాన్ని పరిశీలించినట్లు ఏఎంసీ సెక్రటరీ వాకా రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ మండలంలో ఎక్కువగా గొర్రెలు, మేకలు ఉన్నందున సంత బాగా జరిగే అవకాశం ఉంటుందన్న నమ్మకంతో ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల సూచనలు మేరకు పరిశీలించినట్లు చెప్పారు.